


రంగాచారి మాస్టారింటికి ఓ అబ్బాయొచ్చాడు. టక్ చేసుకుని, గాగుల్స్ పెట్టుకుని పొడుగ్గా, సన్నగా వున్నాడు.

మాస్టారు తీరుబడిగా కూర్చుని రామాయణం చదువుకుంటున్నారు.

"మాస్టారూ"

ఆ పిలుపుకి ఆయన తల పైకెత్తి భూతద్దాల్లోంచి చూశారు.

"ఎవరు బాబూ నువ్వు?"

అతడు నవ్వాడు. "నేను మాస్టారూ మీ శిష్యుణ్ణి రామారావుని, నన్ను గుర్తుపట్టలేదా?"

"ఆ...రామారావా!" ఆయన కళ్ళద్దాలు సర్దుకుని తేరిపార చూశారు.

"అవును మాస్టారూ. స్కూల్లో చదివినప్పుడు అన్నిట్లోనూ ఫస్ట్ నేనే వచ్చేవాణ్ణి. మీరు నన్ను ఎంతో మెచ్చుకునేవారు. పెద్దవాడినయ్యాను కదా. గుర్తుపట్ట లేక పోతున్నారు."

రంగాచారి మాస్టారు ఓ క్షణం ఆలోచించారు. "ఆ...ఆ...గుర్తొచ్చావు బాబు. నీ చదువు పూర్తయి పోయిందా. ఇప్పుడేం చేస్తున్నావ్?" ఆప్యాయంగా అడిగారాయన.

"ఈ ఊళ్ళోనే బ్యాంకులో ఉద్యోగం వచ్చింది మాస్టారూ. ఈ రోజే నేను మా వూరి నుండొచ్చాను. రేపు జాయినవ్వాలి. మిమ్మల్ని చూసి వెళ్దామని ఇలా వచ్చాను."

"అలాగా. చాలా సంతోషం నాయనా. నా శిష్యుడు ప్రయోజకుడయ్యాడంటే నాకెంతో గర్వంగా వుంది. ఉండు బాబు కాఫీ తీసుకొస్తాను."

మాస్టారు లోపలికెళ్ళి ఫ్లాస్కులోని కాఫీ తీసుకొచ్చి ఇచ్చారు. అతడు మొహమాటంగా తాగాడు.

"ఇంట్లో ఎవరూ లేరా మాస్టారూ?"

"లేరు బాబు. పంతులమ్మగారు పెద్దమ్మాయింటికెళ్ళింది. రెండు రోజుల్లో వచ్చేస్తుంది."

"ఈ ఊళ్ళో నాకు తెలిసిన వాళ్ళెవరూ లేరు మాస్టారూ...మీకు అభ్యంతరం లేకపోతే..."

"దానిదేముంది బాబు. ఈ రాత్రికి ఇక్కడే పడుకుని ఉదయాన్నే డ్యూటీలో జాయినవ్వు."

మాస్టారి మాటలు అతడికి ధైర్యాన్నిచ్చాయి.

ఆ రాత్రి నిద్రపోయాక పెద్ద గదిలో అలికిడైతే మాస్టారు లేచి గది దగ్గరకెళ్ళారు. అతడు పెట్టెలు వెతుకుతూ కనిపించాడు.

"కృష్ణా! ఏమిటి వెతుకుతున్నావ్? నీకు కావలసిన డబ్బు అక్కడ లేదు. ఇటురా నేనిస్తాను."

మాస్టార్ని చూసి కృష్ణ కంగారు పడ్డాడు.

"ఏమిటి అలా గాభరాగా చూస్తున్నావ్. నీ పేరు రామారావు కాదని, కృష్ణ అని నాకు ఎలా తెలిసిందనా.

"చూడు కృష్ణా! నేను రిటైరైనా నా జ్ఞాపకశక్తి ఇంకా పోలేదయ్యా. నువ్వొచ్చి నీ పేరు అబద్ధం చెప్పినప్పుడే నువ్వు కృష్ణవని నాకు తెలుసు.

"నీ తల్లిదండ్రుల గారాబంవల్లా, అశ్రద్ధవల్లా చివరికి ఇలా తయారయ్యావన్నమాట. చిన్నతనంలో నువ్వు తప్పుచేసినందుకు నేను మందలిస్తే మీ నాన్నొచ్చి నాకు వార్నింగ్ ఇచ్చి వెళ్ళాడు. ఇప్పుడు నువ్వు దొంగతనం చేసినందుకు నలుగురూ పోగయి కొడితే మీ నాన్నొచ్చి ఎవరికి వార్నింగిస్తాడు."

కృష్ణ భయంగా చూశాడు.

"ఇవిగో తాళాలు నాదగ్గరున్నాయి. నీకు కావలసిన డబ్బు నేనిస్తాను తీసుకో. గురువుగారింట్లో దొంగతన మెందుకయ్యా."

కృష్ణ నిర్ఘాంతపోయాడు. అక్కన్నుంచి పారిపోవడానికూడా అతడికి కాళ్ళాడలేదు.

— నేరేడుమిల్లి అచ్యుతరావ్

